# సత్యం ఆదర్శమైతే, మార్గం అహింసే

**డా॥ అవధానం రఘు కుమార్**

1969లో గాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా భారతదేశంలోనూ, ప్రపంచ వ్యాప్తంగా గాంధీ సిద్ధాంతాలు, ఆచరణ, సాధించిన విజయాలు - ఇలా అనేక అంశాలపై చాలా విస్తృతంగా సాహిత్యం వచ్చింది. అందులో భారతీయులు, గాంధియన్స్ పెద్దగా పట్టించుకొని ఒక గొప్ప రచన - ఎరిక్ ఎరిక్సన్ వ్రాసిన - "గాంధీస్ ట్రూత్ - ఆన్ ది ఆరిజిన్స్ ఆఫ్ మిలిటెంట్ నాన్ వాయెలెన్స్" ఒక ఫ్రాయెడియన్ మనో విశ్లేషణ నిపుణుడిగా ఎరిక్సన్ ఈ పుస్తకంలో గాంధీ ఆలోచనలలో "సత్యం" అంటే ఏమిటి? ఆయన "అహింస" అనే ఆలోచనకు, సత్యానికి ఉన్న సంబంధం ఏమిటి? గాంధీ "అహింస" నిజంగానే హింసను యుద్ధాన్ని వ్యతిరేకించే శాంతి మార్గమా? అనే అంశాలను పరిశీలించాడు.

అయితే ఫ్రాయిడ్, మనో విశ్లేషణ అనగానే మానవ సంబంధాలలో శృంగారం, దాని ద్వారా వచ్చే శాంతి, సంఘర్షణల రూపం అని భావించడం వల్ల, నిజంగానే ఈ రచనలో ఒకటి, రెండు చోట్ల దీనికి సంబంధించిన ప్రస్తావన ఉండటం వల్ల గాంధీ శిష్యులు దీన్ని సీరియస్‌గా తీసుకోలేదు. గాంధీ అహింసకు, ఫ్రాయిడ్ మనో విశ్లేషణకూ ఉన్న సారూప్యతను ప్రతిపాదిస్తూ ఎరిక్సన్ ఇందులో వారిద్దరూ తమ ఎదుటి వ్యక్తులతో చేసే ప్రయోగాలలో అతనిలో సత్యం పట్ల ఎలాంటి సంఘర్షణ సృష్టిస్తారో వివరిస్తాడు. చివరగా ఎరిక్సన్ ప్రతిపాదన - "సత్యం" అనేది ఆదర్శమైతే, దానిని అర్థం చేసుకునే లేదా నిలబెట్టే ఏకైక మార్గం - "అహింస" అని. ఇందులోని మరో ప్రతిపాదన గాంధీ "అహింస" అత్యంత తీవ్రమైన ప్రకంపనలతో కూడిన పద్ధతి. ఇది కేవలం "శాంతి వాదం" కాదు.

గాంధీ జీవితంలో ఆయన లండన్‌లో న్యాయశాస్త్రం చదవడం కోసం గడిపిన రెండున్నర సంవత్సరాలు, సౌత్ ఆఫ్రికా జీవితంలోని తొలి పదేళ్ళు చాలా కీలకం. ఇక్కడే ఆయన తనని ప్రశ్నిస్తున్న భౌతిక, ఆధ్యాత్మిక సమస్యలకు పరిష్కార మార్గాలు వెతుక్కున్నది. ఈ సమయంలో పాశ్చాత్య దేశాల చరిత్ర, నాగరికత, ముఖ్యగా పారిశ్రామిక విప్లవానంతర సమాజపు వికృత రూపాన్ని గాంధి అర్థం  చేసుకుంది. అదే సమయంలో భారతదేశంలో బెంగాలు విభజన - దాని ఫలితంగా యువతలో వచ్చిన తీవ్రవాద, హింసావాదాల పట్ల ఆకర్షణ, సౌత్ ఆఫ్రికాలో కూడా దాని సారూప్యాలు గమనించాడు. బోయర్ యుద్ధం (1899-1900), జులూ తిరుగు బాటు (1906), దాని అణచివేత, అలాగే ఐరిష్ తిరుగుబాటు, దాన్ని బ్రిటన్ ఎదుర్కొనే తీరు - ఇవన్నీ గాంధీలో క్రొత్త ఆలోచనలకు ఆకారం ఇచ్చాయి.

గాంధీ సైద్ధాంతిక రూప కల్పనలో 1894లో ఆయనకూ, ఆయన ఆధ్యాత్మిక గురువు జైన మత జ్ఞాని రాజచంద్రబాయితో జరిగిన ఉత్తర, ప్రత్యుత్తరాలు, చర్చ చాలా కీలకం. ఆధ్యాత్మికత, మోక్షం అంటే సౌరసమాజం నుండి దూరంగా పోయి అడవులలో, అరణ్యాలలో ఆశ్రమ జీవితం గడుపుతూ తపస్సు చేసుకోవడం కాదు, ప్రజల మధ్య ఉంటూ వారి "విడుదల" కోసం కూడా ప్రయత్నించడం అనే ఆలోచన గాంధీలో బీజ ప్రాయంగా అవతరించింది ఈ సమయంలోనే ఇండియాకు తిరిగి వచ్చాక సత్యాగ్రహ ప్రయోగాలు - చంపారణ్, అహమ్మదాబాద్ టెక్స్టైల్ సమ్మె, ఖేదా ఉద్యమాలలో విజయవంతంగా చేసినా చౌరీ-చౌరా సంఘటన (1922) ఆయనను మళ్ళీ అనేక ప్రశ్నలతో ముంచెత్తింది. ముఖ్యంగా 1929 తరువాత గాంధీ తన తొలి ప్రతిపాదన - "భగవంతుడే సత్యం" నుండి "సత్యమే భగవంతుడు" అనే విధంగా మార్చుకున్నాడు. ఈ మార్పుకు సంబంధించిన అంశాలు 1931లో గాంధీకి - రోమైన్ రోలాకు జరిగిన సుదీర్ఘ చర్చలలో కూడా మనకు ప్రస్ఫుటంగా తెలుస్తాయి.

స్వాతంత్ర కాలపు నాటి తీవ్రవాద కమ్యూనిస్ట్ అయిన పన్నాలాల్ దాస్ గుప్తా "రెవల్యూషనరీ గాంధీ" (1954, 2011) పుస్తకంలో ఒక మార్క్సిస్టుగా గాంధీని అర్థం చేసుకుంటూ, వివరిస్తూ ఇలా అంటాడు. "సత్యాన్ని సత్యం ద్వారానే నిలబెట్టాలి, అనేది గాంధీ వాదన". అలాగే గాంధీ "అహింస" - "సాయుధ పోరాటాలతో సమానమైన తీవ్రత కలిగి వుంటుంది, అంటాడు." దాస్ గుప్త ఆ పుస్తకంలో ఈ రెండు ప్రధాన ప్రతిపాదనలు చేశారు. అలాగే ఈ మధ్యకాలంలో అంథోని పరేల్ అనే కాల్గేరీ విశ్వ విద్యాలయం, కెనడా విశ్రాంత చరిత్ర ఉపాధ్యాయుడు - "గాంధీస్ ఫిలాసఫీ అండ్ ది క్వెస్ట్ ఫర్ హార్మనీ"లో గాంధీ తన ఆధ్యాత్మికతను, భారతీయ సాంప్రదాయ, సనాతన మత ప్రాతిపదికలనూ, ఆధునిక రాజకీయాలను, పోరాట మార్గాలను ఎలా పునర్ నిర్వచించారో విస్తృతంగా చర్చించారు. 1893-94 ల మధ్య గాంధీ చాలా తీవ్రమైన ఆధ్యాత్మిక సంక్షోభంలోకి పోయి, సనాతన హిందూ ధర్మంలోని - చతుర్విధ పురుషార్థాలు, ధర్మ, అర్ధ, కామ, మోక్షాలను ఎలా అర్తం చేసుకున్నాడో నేటి అవసరాలకు అన్వయించాడో ఈ పుస్తకంలో ప్రధాన విషయం. ఆధునిక రాజకీయాలను, సాంప్రదాయ ధర్మాలను ఎలా సమన్వయం చేయాలో అన్న విషయంలో గాంధీ పడిన సంఘర్షణ ఇందులో చాలా బాగా వివరించబడ్డది. ముఖ్యంగా ఆదునిక రాజకీయాలలో ధర్మ, కామాలనే విషయాలను ఎలా అర్థం చేసుకోవాలి, తద్వారా ప్రతి బాధ్యత కల పౌరుడు ఎందుకు రాజకీయాలలో పాలు పంచుకోవాలో గాంధీ వివరించిన తీరు, పేరెల్ దాన్ని మన ముందు వుంచిన తీరు చాలా విలువైన సమాచారం.

గాంధీజీకి ముందు - హింసనూ, యుద్ధాన్ని ఎదుర్కొనే మార్గాలు ప్రధానంగా మూడు - ప్రతి హింస, శాంతి, లేదా ఆధ్మాత్మిక మార్గం. 1883-1922ల మధ్య గాంధీ తన ఆలోచనలలోనూ, ఆచరణలలోనూ ప్రశ్నించి, తీవ్రంగా పరిశోధించి, సంఘర్షణకులోనై కనుక్కున్న నాల్గవ మార్గం - "సత్యం", "అహింస". ఇవి అంతకు ముందు పాశ్చాత్య దేశాలలో ముఖ్యంగా పారిశ్రామిక విప్లవం తరువాతి దశలో వచ్చిన హింసా, శాంతి మార్గాలనూ, భారత, తూర్పు దేశాలలో ఉన్న ఫలాయన వాదాలు, ఆధ్యాత్మిక మార్గాలను అన్నింటినీ తిరస్కరిస్తూ వచ్చిన అత్యంత తీవ్రత, గాఢత కలిగిన మార్గం. అందుకే మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ కూడా - గాంధీ "అహింస"ను "మిలిటెంట్ నాన్ వయెలెన్స్" అనే నిర్వచించుకున్నాడు. పాశ్చాత్య మేధావులు కూడా హింసకు వ్యతిరేకించారు. కానీ అది కేవలం పాసిఫిజం. అందులో కూడా నిష్క్రియా వాదం ఫలాయన వాదమే వుంది.

గాంధీ తాత్త్వికతను రూపొందించుకునే క్రమంలో చేసిన ఆయన 'తొలి రాజకీయ సిద్ధాంత రచన - "హింద్ స్వరాజ్." భారతదేశంలో బెంగాలు, మహారాష్ట్రలలో, ప్రపంచ వ్యాప్తంగా పాశ్చాత్య రాజకీయ సిద్ధాంతాలలో - మాఖియవెల్లీ నుండి, మార్క్స్ - లెనిన్‌ల దాకా, కనిపించే తీవ్రవాదం, హింసావాదం, వాటి నిరుపయోగతనూ ప్రశ్నించిన రచన. ప్రపంచంలో, చరిత్రలో ఏదైనా స్థిరమైన మార్పు వచ్చి వుంటే అవి అన్నీ ప్రేమ ద్వారా వచ్చినవే అని, హింస ద్వారా కాదనీ, భారతదేశం సాతంత్ర్యం కోరుకుంటే ఈ పాశ్చాత్య ఆలోచనల ప్రభావం నుండి బయటికి రావాలనే ప్రతిపాదనలు కూడా ఇందులో కనిపిస్తాయి. 1909లో లండన్ నుండి తిరిగి వస్తూ - ప్రయాణంలో వేగంగా వ్రాసిన ఈ పుస్తకం గాంధీ "అహింస" తాత్వికతకు ప్రధాన భూమిక.

జైన, వైష్ణవ సాంప్రదాయాలలో పెరిగిన గాంధీ జైనంలో స్వాద్ వాదం, అనేకాంత వాదాలనీ, అలాగే వైష్ణవ సాంప్రదాయంలోని సత్యం యొక్క విభిన్న రూపాలనే భావననూ తన సిద్ధాంతాలకు ప్రాతిపదిక చేసుకున్నట్టు తెలుస్తోంది. అలాగే ప్రపంచ వ్యాప్తంగా వున్న అనేక మత సిద్ధాంతాల సమన్వయము  కూడా ఇందులో కలిసిస్తుంది. ఇందుకు పెద్ద ఉదాహరణ - "భగవద్గీత" కు గాంధీ వ్రాసిన వ్యాఖ్యానం. అందులో అర్జునుడి ప్రశ్నలను వ్యాఖ్యానిస్తూ : "ఒక వేళ అర్జునుడు మొత్తం హింసను వ్యతిరేకిస్తే కృష్ణుడు కూడా ఒప్పుకునే వాడేమో, కానీ అర్జునుడి "తన వారిని చంపలేను" అన్న అసంబద్ధ వాదనను మాత్రం కృష్ణుడు అంగీకరించలేకపోయాడు" అంటాడు.

అలాగే ఖేదా ఉద్యమం తరువాత **1918-1919** లో మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ తరపున సైనికులుగా చేరమని భారతీయులకు ఆయన చేసిన ప్రతిపాదన పెద్ద చర్చకు దారి తీసింది. సి.ఎఫ్. ఆండ్రూస్, ఈస్తర్ ఫెరింగులు గాంధీని, ఆయన అహింసా వాదాన్ని ప్రశ్నించినపుడు ఆయన సమాధానాలు కూడా విస్మయాన్ని కలిగిస్తాయి. "ఏ దేశమైతే యుద్ధం చేయడానికి సంసిద్ధత ప్రదర్శించలేదో ఆ దేశం అహింస ద్వారా తన శక్తిని తెలియ చేయలేదు'' అంటాడు. గాంధీ అహింస బలవంతుడి ఆయుధం. పిరికివాడికి, బలహీనతతో యుద్ధం చేయలేని వాడికి కాదు. అపిష్ నంది తన "ఇంటిమేట్ ఎనిమీ''లో కూడా గాంధీ అహింసలో - అహింస, నివారించదగిన హింస, అనివార్య హింస'' అనే మూడు ప్రతిపదికలు ఉంటాయి అంటాడు. ఇది గాంధీ హింసలో ఉన్న సంక్లిషత, గాఢత, తీవ్రత.